క్లుప్తంగా

పండుగ నాడూ పీహెచ్‌సీలో ప్రసవం



కారెంపూడి: విజయదశమి సోమవారం కారెంపూడి పీహెచ్‌సీలో ఒక మహిళ పండంటి మగ బిడ్డకు జన్మనిచ్చింది. మండలంలోని ఒప్పిచర్ల గ్రామానికి చెందిన బత్తుల దుర్గ పురిటి నొప్పులతో బాధపడుతుంటే ఆశా కార్యకర్త వెంటనే ఆమెను స్థానిక పీహెచ్‌సీకి తరలించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ బి.దుర్గారావు ఆమెకు వైద్య పరీక్షలు నిర్వహించి సుఖ ప్రసవం చేయించారు. తల్లీ బిడ్డ క్షేమంగా ఉన్నారని, జీరో డోస్ వ్యాక్సిన్ ఇచ్చి తల్లి పాలు పట్టించడం జరిగిందని బిడ్డ 3 కిలోలున్నాడని డాక్టర్ దుర్గారావు తెలిపారు. పండుగ నాడు కూడా ఆసుపత్రిలో అందుబాటులో ఉండి ప్రసవం సవ్యంగా జరిగేలా చూసిన డాక్టర్ దుర్గారావు, వైద్య సిబ్బందికి కుటుంబ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు. దుర్గకు ఇది రెండవ కాన్పు.

నేడు పట్టుబడిన వాహనాలకు బహిరంగ వేలం

రెంటచింతల: స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో బుధవారం లిక్కర్(మద్యం) కేసులలో పట్టుబడిన వాహనాలకు బహిరంగ వేలం పాటలను నిర్వహిస్తున్నట్లు ఎస్‌ఐ సామెల్ రాజీవ్ కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని వివిధ గ్రామాలలో కొంతకాలం కిందట అక్రమంగా లిక్కర్‌ను తరలిస్తున్న వాహనాలను సీజ్ చేయడం జరిగిందన్నారు. పట్టుబడిన 4 ద్విచక్ర వాహనాలకు, ఒక కారుకు ఉదయం 11 గంటలకు నిర్వహించనున్న వేలం పాటలో ఆశక్తి కలిగిన వారు పాల్గొని వాహనాలను దక్కించుకోవచ్చన్నారు.

నేడు విజయపురిసౌత్‌లో జగనన్న ఆరోగ్య సురక్ష


విజయపురిసౌత్: జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం విజయపురిసౌత్ గ్రామ సచివాలయం-1 పరిధిలోని క్యాంప్-2 ఎంపీపీ పాఠశాలలో బుధవారం నిర్వహిస్తున్నట్లు మాచర్ల ఎంపీడీవో సరోజినిదేవి మంగళవారం తెలిపారు. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు స్పెషలిస్ట్ డాక్టర్లు వైద్య పరీక్షలు నిర్వహించి రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేస్తారని తెలిపారు. అలాగే కంటి పరీక్షలు కూడా చేసి ఉచితంగా కళ్ళజోళ్ళు అందజేస్తారని తెలిపారు. వైద్య పరీక్షలకు హాజరయ్యే వారు తమ వెంట ఆధార్‌కార్డు తెచ్చుకోవాలన్నారు. గ్రామ ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పరిశుద్ధ క్రీస్తును ఆరాధించండి



దాచేపల్లి : ప్రతి ఒక్కరు పాపములను విడిచి మరియతల్లి కుమారుడైన పరిశుద్ధ క్రీస్తును ఆరాధించాలని గుంటూరు బిషప్ రెవరెండ్ డాక్టర్ చిన్నాబత్తిన భాగ్యయ్య అన్నారు. నారాయణపురంలోని పరిశుద్ధ ఫాతిమా మాత దేవాలయం 37వ ప్రతిష్ఠ వార్షికోత్సవ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ప్రభుత్వ సలహాదారుడు రెవరెండ్ డాక్టర్ మద్దు బాలస్వామితో కలిసి బిషప్ భాగ్యయ్య ఆలయ సింహద్వారం, సోలార్ దీపాలను ప్రారంభించారు. అనంతరం ఆలయంలో దివ్య బలిపూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బిషప్ భాగ్యయ్య మాట్లాడుతూ సర్వమానవాళిని పాపము నుంచి విడిపించేందుకు ఏసుక్రీస్తు భూలోకంలో జన్మించాడని, ప్రతి ఒక్కరు క్రీస్తు గురించి తెలుసుకుని మారుమనస్సు పొంది పవిత్రంగా జీవించాలన్నారు. ప్రభుత్వ సలహాదారుడు డాక్టర్ బాలస్వామి మాట్లాడుతూ చర్చిల అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఫాదర్ యామర్తి సురేష్, పలువురు ఫాదర్లు, సిస్టర్లు పాల్గొన్నారు.

వైభవంగా షిరిడీసాయి బాబా వార్షికోత్సవం



పెదకూరపాడు: మండలంలోని 75 త్యాళ్లూరు అయోధ్యస్వామి ఆశ్రమంలో షిరిడిసాయిబాబా 105వ వార్షికోత్సవం మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఆధ్యాత్మిక గురువు స్వతంత్ర భారతి మాట్లాడుతూ చిన్నతనం నుంచే ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలన్నారు. అనంతరం అయోధ్య స్వామి, సాయిబాబాల చిత్రపటాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవి శరన్నవరాత్రులలో భాగంగా మహిళలకు పసుపుకుంకుమలు, నిమ్మకాయలు, తీర్థప్రసాదాలు అందించారు.



రథంపై అమ్మవారి ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు



వాసవి అమ్మవారి లడ్డును దక్కించుకున్న సాంబశివరావు, దేవాలయ కమిటీ అధ్యక్షుడు చీతిరాల కోటేశ్వరరావు తదితరులు



అమ్మవారి ఊరేగింపులో కోలాటం ఆడుతున్న మహిళలు, చిన్నారులు

వైభవంగా ముగిసిన దేవి శరన్నవరాత్రి మహోత్సవాలు

రూ. 1.65 లక్షలు పలికిన వాసవి అమ్మవారి లడ్డూ

కారెంపూడి: విజయ దశమి నాడు కారెంపూడిలో వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారు రాజరాజేశ్వరి దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని సర్వాంగ రజిత కవచంతో పాటు బంగారు కిరీటంతో భక్తులకు కనువిందు చేశారు. కాగా అమ్మవారి లడ్డూకు వేలం నిర్వహించగా ఆతుకూరి సాంబశివరావు రూ.1.65,000లకు దక్కించుకున్నాడు. కార్యక్రమంలో దేవస్థాన కమిటీ అధ్యక్షుడు చీతిరాల కోటేశ్వరరావు, కార్యదర్శులు యక్కల కోటేశ్వరరావు, కొత్తా బ్రహ్మేశ్వరరావు, కోశాధికారి సూరె కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉంటే పల్నాటి వీర్ల అంకాలమ్మ తల్లి కూడా రాజరాజేశ్వరిదేవిగా దర్శనమిచ్చారు. వేలాదిగా భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. దాదాపు మండలంలోని అన్ని దేవాలయాలలో దసరా నాడు అమ్మవారి మహోత్సవాలు వైభవంగా జరిగాయి. వాడవాడలా బతుకమ్మ పూజలు ఆ తర్వాత ఊరేగింపులు నిర్వహించి బతుకమ్మను నిమజ్జనం చేశారు.

భక్తి శ్రద్ధలతో విజయదశమి వేడుకలు

రెంటచింతల: మండలంలోని వివిధ గ్రామాల్లో సోమవారం విజయదశమి వేడుకలను భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. స్థానిక శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో అమ్మవారు స్వర్ణ కవచ ధారణిదేవి అలంకారంలో, సత్రశాల శ్రీ గంగా భ్రమరాంబ సమేత శ్రీమల్లిఖార్జున స్వామి దేవస్థానంలో అమ్మవారు శ్రీ రాజరాజేశ్వరి దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ప్రముఖ శైవక్షేత్రమైన సత్రశాల పుణ్యక్షేత్రంలో పూజలు, అభిషేకాలు నిర్వహించేందుకు రెండు తెలుగురాష్ట్రాలలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. త్రిశక్తి పీఠంగా విరాజిల్లుతున్న పాలువాయిజంక్షన్ వద్ద శ్రీ కనకదుర్గమ్మ దేవస్థానంలో అమ్మవారు విజయదుర్గాదేవిగా, రెంటచింతలలోని శ్రీ చౌడేశ్వరి అమ్మవారు ప్రత్యేక అలంకారంలో దర్శనమిచ్చారు. జెట్టిపాలెం గ్రామంలో గిరిజన నాయకులు వడితే భీమ్లానాయక్, శంకర్‌నాయక్‌లు బాలిబాలికలకు బతుకమ్మపై పాటల పోటీలు నిర్వహించి బహుమతులను అందజేశారు. మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొని బతుకమ్మ నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించిన వాహనాలపై అమ్మవారిని, మహిళ భక్తులు బతుకమ్మలతో మేళతాళాలతో గ్రామోత్సవం నిర్వహించి ఏడుమంగళం, గోలివాగు, పిల్లివాగు, కంభంపాడు పెద్ద కాలువ, సత్రశాల వద్ద కృష్ణానదిలో నిమజ్జనం చేశారు. సత్రశాల దేవస్థానం ట్రస్ట్‌బోర్డు చైర్మన్ బద్దూరి బ్రహ్మారెడ్డి, శ్రీ వాసవి అమ్మవారి దేవస్థానం అధ్యక్షులు కట్టమూరి వెంకట నాగేశ్వరరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఘనంగా దసరా ఉత్సవాలు

మాచవరం: మండలంలోని పలు గ్రామాల్లో దసరా ఉత్సవాలను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. గ్రామాల్లో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. పలు గ్రామాల్లో ఆయుధ పూజలు నిర్వహించారు. స్వామివార్ల ఉత్సవ విగ్రహాలను గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. బతుకమ్మలను ప్రత్యేకంగా అలంకరించి, ఆటపాటలతో ఊరేగించారు. పలు చోట్ల మహిళల కోలాట ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.



రజత కవచాలంకృత కారెంపూడి వాసవి అమ్మవారు



స్వర్ణ కవచ ధారణిగా వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారు



రెంటచింతల చౌడేశ్వరి అమ్మవారి దేవస్థానంలో ప్రత్యేక అలంకారంలో చౌడేశ్వరిమాత



పాలువాయి జంక్షన్ వద్ద విజయదుర్గాదేవి అలంకారంలో కనకదుర్గమ్మ అమ్మవారు



వివిధ వేషధారణలతో అమ్మవారి ఊరేగింపు

ఆఖరి రోజు విశేషంగా పూజలు

దాచేపల్లి : దేవీశరన్నవరాత్రులలో ఆఖరి రోజు సోమవారం ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. స్థానిక శ్రీ వీర్ల అంకమ్మతల్లి దేవాలయం, శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవాలయం, శ్రీ కనకదుర్గమ్మ తల్లి దేవాలయంతో పాటు మండపాలలో ఏర్పాటు చేసిన విగ్రహాల వద్ద భక్తులు పూజలు నిర్వహించి అమ్మవారి ప్రసాదాలను స్వీకరించారు. దసరా పండుగ సందర్భంగా బతుకమ్మలను, మండపాలలోని విగ్రహాలను మేళతాళాలతో ఊరేగించి నాగులేరులో నిమజ్జనం చేశారు. పండుగ సందర్భంగా ఆలయాలను విద్యుత్ దీపాలతో అలంకరణ చేశారు.

ఎమ్మెల్సీ జంగా పూజలు

దసరా పండుగ సందర్భంగా ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి, శ్రీ కనకదుర్గమ్మ తల్లి దేవాలయాలతో పాటు పలు మండపాలలోని విగ్రహాల వద్ద ఎమ్మెల్సీ జంగా పూజలు చేసి



దసరా ఉత్సవంలో ఎమ్మెల్సీ జంగా, దేవళ్ల రేవతి

అమ్మవారి ప్రసాదాలను స్వీకరించారు. నారాయణపురం టెలిఫోన్ ఎక్స్ఛేంజ్ వద్ద వడ్డెర కార్పొరేషన్ చైర్‌పర్సన్ దేవళ్ల రేవతి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అమ్మవారి విగ్రహం వద్ద ఎమ్మెల్సీ జంగా పూజలు చేశారు. అనంతరం మహా అన్నదాన కార్యక్రమం ప్రారంభించారు. ఎమ్మెల్సీ వెంట నగర పంచాయతీ చైర్మన్ కొప్పుల సాంబయ్య, మాజీ సర్పంచ్‌లు బుర్రి విజయ్‌కుమార్‌రెడ్డి, మందపాటి రమేష్‌రెడ్డి, దేవళ్ల రఘు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు పల్లపు వెంకటేశ్వర్లు, బత్తుల వెంకయ్య తదితరులు ఉన్నారు.

అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్సీ జంగా ..

మండలంలోని మోర్జంపాడు గ్రామంలో వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పూజా కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ బీసీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు, శాసనమండలి విప్, ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి అమ్మవారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. అందరిని క్షేమంగా కాపాడాలని అమ్మవారిని వేడుకున్నారు. ఆయన వెంట గ్రామ వైఎస్సార్ సీపీ నాయకులు ఉన్నారు.

దుర్గిలో వైభవంగా దుర్గాదేవి ఊరేగింపు

దుర్గి: దసరా పండుగ సందర్భంగా మండల కేంద్రం దుర్గిలోని వెంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన దుర్గాదేవి విగ్రహం ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ప్రతిరోజు అమ్మవారిని వివిధ దేవతామూర్తులుగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. విజయదశమి రోజు అమ్మవారిని ప్రత్యేక వాహనంపై ఊరేగింపు నిర్వహించారు. మహిళలు, చిన్నారులు కోలాటాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. పెద్ద ఎత్తున మహిళలు భక్తి శ్రద్ధలతో బతుకమ్మలాడి విశేష పూజలు నిర్వహించారు. పండుగ సందర్భంగా మండల పరిధిలోని ముటుకూరు, అడిగొప్పల, ఓబులేసున పల్లె, ఆత్మకూరు, ధర్మవరం, కంచరగుంట తదితర గ్రామాల్లోని ఆలయాలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

ముగిసిన దసరా శరన్నవరాత్రులు

గురజాల : దసరా శరన్నవరాత్రులు సోమవారంతో ముగిసాయి. నగర పంచాయతీ పరిధిలోని గురజాల, జంగమహేశ్వరపురం గ్రామాల్లో ఏర్పాటుచేసిన అమ్మవార్ల విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించారు.

బతుకమ్మలను పురవీధుల్లో మహిళలు పాటలు పాడుతూ ప్రత్యేకంగా పూజించి అనంతరం నిమజ్జనం చేశారు. 9 రోజుల పాటు ప్రత్యేక పూజలు అందుకున్న అమ్మవార్లను ఆయా కమిటీల ఆధ్వర్యంలో ప్రత్యేక వాహనాలపై గ్రామ పురవీధుల్లో ఊరేగించారు.

అమ్మవార్లను దర్శించుకున్న ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం..

దసరా ఉత్సవాలను పురస్కరించుకుని శ్రీ పాతపాటేశ్వరి అమ్మవారి దేవాలయంలో ఏర్పాటుచేసిన అమ్మవార్లను ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దేవాలయ కమిటీ సభ్యులు కనకం ఆదినారాయణ తదితరులు చంద్రగిరి ఏసురత్నంను సత్కరించారు. అమ్మవారి ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఉండాలని ఆకాంక్షించారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి యెనుముల మురళీధర్‌రెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అంగరంగ వైభవంగా దసరా వేడుకలు

పిడుగురాళ్ల: దసరా పర్వదినాన్ని పురస్కరించుకొని పట్టణంలోని వివిధ దేవాలయాల్లో అమ్మవార్లను దుర్గాదేవిగా అలంకరించారు. అమ్మవారిని ఉదయం నుంచే భక్తులు దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. అనంతరం సాయంత్రం సమయంలో అమ్మవారిని మేళతాళాలు, వివిధ వేషధారణలతో పట్టణంలో ఊరేగింపు నిర్వహించి, బతుకమ్మలను నిమ్మజ్జనం చేశారు.



పిడుగురాళ్లలో బతుకమ్మలతో మహిళలు



మాచవరంలో బతుకమ్మలను తలపై ధరించి ఊరేగింపుగా తరలివస్తున్న మహిళలు



పోటీలో గెలుపొందిన బాలబాలికలు

మహిషాసురమర్దిని అలంకారంలో అమ్మవారు

విజయపురిసౌత్: స్థానిక సి టైపులోని కనకదుర్గా వెంకటేశ్వర ఆలయంలో అమ్మవారు మహిషాసురమర్దినిగా మంగళవారం భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు నరసింహమూర్తి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే మెయిన్‌బజార్‌లోని అమ్మవారు శ్రీ రాజరాజేశ్వరి దేవి అలంకారంలో దర్శనం ఇచ్చారు. అర్చకులు నరసింహమూర్తి గుడిపూడి బ్రహ్మాచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు అమ్మవారికి కుంకుమపూజలు, సహస్రనామ పూజలు జరిపారు. దసరా సందర్భంగా అమ్మవారి ఆలయాల వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

అధిక ధరలకు విక్రయిస్తే చట్టపరమైన చర్యలు

రెంటచింతల: రైతులకు ఎరువులు, పురుగు మందులను అధిక ధరలకు విక్రయిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుని కేసులు నమోదు చేస్తామని మండల వ్యవసాయ అధికారి బోయపాటి బ్రహ్మారెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రమైన రెంటచింతలలోని పలు ఎరువులు, పురుగు మందుల షాపులలో ఆకస్మికంగా తనిఖీలు చేపట్టి ఆయన మాట్లాడారు. ప్రతి ఎరువుకు, పురుగు మందులకు కచ్చితంగా పీసీలు కలిగి ఉండాలన్నారు. పీసీలు లేకుండా అమ్మడం చట్టప్రకారం నేరమన్నారు. ఎప్పటికప్పుడు క్రయ విక్రయాలకు సంబంధించిన సమాచారం రికార్డులలో నమోదు చేయాలన్నారు. రైతులు కొనుగోలు చేసిన ఎరువులకు, పురుగు మందులకు ఇచ్చే బిల్లులో తేదీ, బ్యాచ్ నంబర్, లాట్ నంబర్ నమోదు చేసి ఇవ్వాలన్నారు. షాపులో



స్టాక్ వివరాల రికార్డు ఎప్పుడూ అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. అనుమతి లేని మందులను, ఎరువులను విక్రయించిన వారిపై తీవ్రమైన చర్యలు తప్పవన్నారు.

నాటుసారా విక్రయిస్తున్న మహిళ అరెస్ట్

వినుకొండ(నూజెండ్ల): నాటుసారా అమ్ముతున్న మహిళను వినుకొండ ఎస్ఈబీ పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. వినుకొండ మండలంలోని పార్వతీపురం గ్రామంలో పోలేరమ్మ గుడి వద్ద త్రిపురాంతకం మండలం డీవీఎస్ కాలనీకి చెందిన పోలిశెట్టి నాగమణి అనే మహిళ నాటుసారా విక్రయిస్తుండగా ఆమెను అదుపులోకి తీసుకొని 2 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. నాగమణిపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేసి వినుకొండ మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరచగా 15 రోజులు రిమాండ్ విధించడం జరిగింది. ఈ దాడిలో ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ ఆర్. విజయభాస్కరరావు, సబ్ ఇన్‌స్పెక్టర్, సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయస్థాయి స్విమ్మింగ్ పోటీలకు జగదీష్

నరసరావుపేట ఈస్ట్: సుబ్బరాయ అండ్ నారాయణ కళాశాల స్విమ్మింగ్ పూల్‌లో సాధన చేస్తున్న ఎస్.జగదీష్ జాతీయస్థాయి స్విమ్మింగ్ పోటీలకు ఎంపికైనట్టు పల్నాడుజిల్లా స్విమ్మింగ్ అసోసియేషన్ కార్యదర్శి వై.వి.సుబ్బారెడ్డి, కోశాధికారి శ్రీనివాసరెడ్డి, మంగళవారం తెలిపారు. ఈనెల 26వ తేదీ నుంచి నవంబర్ 5వతేదీ వరకు గోవాలో జరగనున్న 37వ జాతీ యస్థాయి అక్వాటిక్ సిమ్మింగ్ పోటీలలో జగదీష్ ఆంధ్రప్రదేశ్‌కు ప్రాతినిథ్యం వహిస్తాడని వివరించారు. ప్రతి నాలుగు సంవత్సరాలకు ఒకసారి జరిగే ఈపోటీలను ఇండియాన్ ఒలంపిక్స్‌గా క్రీడాకారులు భావిస్తారని, అటువంటి పోటీలలో పల్నాడుజిల్లా నుంచి జగదీష్ ఎంపిక కావటం అభినందనీయమని తెలిపారు. జగదీష్‌ను జిల్లా స్విమ్మింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ ఏ.వి.వి.రామలింగారెడ్డి నూతన స్విమ్మింగ్ స్పోర్ట్స్ కిట్‌తో పాటు రూ.5 వేలు నగదుతో సత్కరించారు. జాతీయస్థాయిలో పల్నాడు జిల్లాకు పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.



జగదీష్‌ను సత్కరిస్తున్న జిల్లా సిమ్మింగ్ అసోసియేషన్ ప్రతినిధులు

27న కోటలో ఉరుసు

యడ్లపాడు: మండలంలోని కొండవీడు గ్రామం కొండవీడు కొండపైన మెట్ల మార్గంలో వేంచేసి హజరత్ సయ్యద్ పీర్ పాఛవలి బాబా ఉరుసు మహోత్సవం ఈనెల 27వ తేదీ శుక్ర వారం నిర్వహిస్తున్నట్లు దర్గా నిర్వాహకులు తెలిపారు. ఉదయం నుంచి ప్రారంభమయ్యే ఈ ఉరుసుకు రాష్ట్రం నలుమూలల నుంచి తరలి వచ్చే భక్తులకు ఇబ్బందులు లేకుండా అన్నీ సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. ఉరుసు మహోత్సవానికి విచ్చేసిన భక్తులకు రాత్రి 8 గంటలకు కోట గ్రామంలో భారీ అన్నదానం ఏర్పాటు చేసినట్లు వివరించారు.

అదేరోజు రాత్రి గంధమహోత్సవ కార్యక్రమం బయలుదేరి మరుసటి రోజు తెల్లవారుజామున దర్గావద్దకు చేరుకుంటుందన్నారు. అనంతరం ముజావర్ల సమక్షంలో దీపారాధన (ఫాతెహా) నిర్వహించనున్నట్లు తెలిపారు. దర్గా కమిటీ సభ్యులు మద్దినగర్ షేక్ బాజీ, షేక్ ఖాజ (బాజీ షహీద్ బ్యాటరీవర్క్), అలాం అమానుల్లా, అబ్దుల్ దావత్, అబ్బుతాలిక్, బాష ఉరుసు కార్యక్రమ వివరాలను తెలిపారు.

నేడు వేల్పూరులో ఆలయ నిర్మాణానికి శ్రీకారం

శావల్యాపురం: మండలంలోని వేల్పూరు గ్రామంలో వేంచేసియున్న గంగమ్మ తల్లి దేవాలయం పునః నిర్మాణ కార్యక్రమం బుధవారం ఉదయం 8.31 నిమిషాలకు జరుగుతుందని ఆలయ కమిటీ సభ్యులు మంగళవారం తెలిపారు. సుమారు రూ. 50 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా స్థానిక ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు హాజరవుతున్నారన్నారు.

కపోతేశ్వరస్వామి వారికి సర్వాంగం, నాగాభరణం బహూకరణ

నకరికల్లు: శిబిచక్రవర్తి కాలంనాటి చరిత్ర కలిగి, దక్షిణకాశీగా భక్తులచే నీరాజనాలందుకుంటున్న చేజర్లలోని శ్రీకపోతేశ్వర స్వామివారికి విజయవాడకు చెందిన పసుపులేటి కిరణ్‌కుమార్ దంపతులు వెండి వస్తువులను మంగళవారం బహూకరించారు. ఆరున్నరకిలోల వెండితో తయారుచేసిన స్వామివారి సర్వాంగం, నాగాభరణాలను ఆలయ ప్రధాన అర్చకులు కొండకావూరి వెంకట్రామయ్య శర్మకు అందజేశారు. అనంతరం విశేష పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కిరణ్‌కుమార్ కుటుంబసభ్యులు పసుపులేటి యామిని, ఖ్యాతేష్, కార్తీక తదితరులు పాల్గొన్నారు.



వెండి సర్వాంగం, నాగాభరణంతో పసుపులేటి కిరణ్‌కుమార్ కుటుంబసభ్యులు